## క్లుప్తంగా

### ఈనెల 28న క్యాంపస్ ఇంటర్వ్యూలు

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరా గాంధీ డిగ్రీ కళాశాలలో ఈనెల 28వ తేదీన క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ అప్పలనాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉభయ రాష్ట్రాల్లోని 9 కంపెనీలకు చెందిన ప్రతినిధులు తమ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్టు పేర్కొన్నారు. పదో తరగతి,ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన వారు అర్హులని, ఆసక్తి గల అభ్యర్థులంతా ఆరోజు ఉద యం 10 గంటలకు ఫ్లైఓవర్ పక్కనే గల కళాశాలలో అన్ని ధ్రువపత్రాలు, బయోడేటా, పాస్ పోర్ట్‌సైజ్ ఫొటోలతో హాజరు కావాలని కోరారు. ఎంపికైన వారికి రూ.12వేల నుంచి రూ.25 వేల వరకు జీతం ఇచ్చే అవకాశం ఉందని, ఈఅవకాశాన్ని బొబ్బిలి పరిసర మండలాల్లోని నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని సూచించారు.

### వైద్యఖర్చులకు ఆర్థిక సాయం


శిష్టకరణ సంఘ సభ్యులకు నగదు అందజేస్తున్న స్నేహం అసోసియేషన్ సభ్యులు

రాజాం సిటీ: పట్టణానికి చెందిన ఉరిటి అనిల్ కుమార్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈయనకి గుండె ఆపరేషన్ చేయాలని, రూ. 20లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో అంత ఆర్థికస్థోమతలేక బాధితుడి కుటుంబసభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయాన్ని శిష్టకరణ సంఘం అధ్యక్షుడు పక్కి వాసు, ఆ సంఘ సభ్యులు స్నేహం అసోసి యేషన్ సభ్యులకు వివరించారు. దీంతో స్నేహం అసోసియేషన్ సభ్యులు స్పందించి తమవంతు సాయంగా రూ. 34,116 బుధవారం అందజేశారు. స్నేహం అసోసియేషన్ సభ్యులు అంబికా కోటేశ్వరరావు, కొత్తా సాయి, ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, కల్లేపల్లి శ్రీనివాసరావు, నాగేంద్ర, శ్రీకర్ పాల్గొన్నారు.

### జూలై 5న జాతీయలోక్ అదాలత్


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ

రాజాం సిటీ: స్థానిక కోర్టులో జూలై 5వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ సూచించారు. కోర్టు ఆవరణలో న్యాయవాదులు, రెవెన్యూ సిబ్బంది, బ్యాంకు అధి కారులు, పోలీసులు, చిట్‌ఫండ్ కంపెనీల సిబ్బంది తో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్ కేసులన్నీ లోక్ అదాలత్‌లో పరిష్కరించనున్నామని చెప్పారు.న్యాయవాదులు, పోలీసులు సహకరించి వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవా లని, కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజులు కూడా వాపస్ ఇవ్వనున్నట్టు తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి కె.నైమిష, న్యాయవాదులు ఆర్.విజయ్‌కుమార్, ఆర్‌ఈసీహెచ్ జయదేవ్, బి. తిరుపతినాయుడు, ఎక్సైజ్ ఎస్‌ఐ జి.మాన్యాలు, రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల పోలీస్, బ్యాంకు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

### సేవలే గుర్తింపునిస్తాయి


టెక్నికల్ అసిస్టెంట్లను సత్కరిస్తున్న ఎంపీడీఓ రవికుమార్, తదితరులు

బొబ్బిలిరూరల్: ఏ ఉద్యోగికైనా విధి నిర్వహణలో అందించిన ఉత్తమ సేవలతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంపీడీఓ పి.రవికుమార్ అన్నారు.ఇతర మండలాలకు బదిలీ అయిన ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు ఆర్. రామారావు,పి.శంకరరావు, వై.సత్యనారాయణ,బి.నటరాజ్, ఎం.పోలినాయుడును స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సన్మానించారు. డిప్యూటీ ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, ఏపీఓ లక్ష్మీపతిరాజు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.


సంతకవిటి: అధ్వానంగా ఉన్న రామారాయపురం వై జంక్షన్ నుంచి చిత్తారపురం మెయినరోడ్డును అనుసంధానం చేసే రోడ్డు


సంతకవిటి: రామారాయపురంలో సాయన్నగెడ్డ వంతెన వద్ద బురదతో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు


వంగర : రుషింగి గ్రామంలో చిత్తడిగా ఓ వీధి


సంతకవిటి: దమ్ముమడిలా పోతులజగ్గపేట-రంగారాయపురం రోడ్డు

# రోడ్లు బురదమయం.. ప్రయాణం భయం భయం

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- చినుకు పడితే చిత్తడిగా మారుతున్న వైనం
- రాకపోకలకు తప్పని ఇక్కట్లు

సంతకవిటి:

మండలంలోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. వర్షాకాలంలో ఈ మార్గాల్లో రాకపోక లు సాగించేందుకు ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. చినుకు పడితే చాలు చిత్తడి, చిత్తడిగా మారుతున్నాయి. కొన్ని రోడ్లయితే దమ్ము మడులను తలపిస్తున్నాయి. పోతుల జగ్గపేట గ్రామం నుంచి లాబాం బ్రిడ్జిని అనుసంధానం చేసే గ్రావెల్ రోడ్డులో నిత్యం వందల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈమార్గంలోనే రంగారాయపురం, కొత్తూరు రామచంద్రపురం గ్రామాలను చేరుకో వాలి. ఈరోడ్డులో ఎక్కడికక్కడే గోతులు దర్శనమిస్తున్నాయి. తాజాగా కురిసిన వర్షాలకు ఈ గోతుల్లో నీరు చేరడంతో రోడ్డంతా బురదమయం కావడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు అదుపుతప్పి పడిపోతున్నారు. అలాగే పొందూరు-సంతకవిటి ప్రధాన రహదారిలో రామారాయపురం వై జంక్షన్ నుంచి సంతకవిటి- చిత్తారపురం బీటీ రోడ్డును అనుసంధానం చేసే గ్రావెల్ రోడ్డు పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. నిత్యం ఈ రహదారి గుండా చిత్తారపురం, పోడలి, గుజ్జన్నపేట, పిల్లలపేట, హొంజరాం తదితర గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రానికి, పొందూరు ఈ రోడ్డులోనే వెళ్లాలి.ఈ రోడ్డుకూడా ఎక్కడికక్కడ గోతులతో చిత్తడిగా తయారైంది. అధికారులు స్పందించి ఈ రోడ్లను తారురోడ్లుగా అభివృద్ధి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, ఆ మార్గాల్లో ప్రయాణించే వారు కోరుతున్నారు.


వంగర: బలిజిపేట మండలంలోని గౌరీపురం గ్రామానికి వెళ్లే రోడ్డులో కొండచాకరాపల్లి వద్ద పరిస్థితి

**దమ్ముమడుల్లా...**

వంగర: మండలంలోని కె.కొత్తవలస, కొండచాకరాపల్లి గ్రామాల మీదుగా పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలంలోని గౌరీపురం గ్రామానికి వెళ్లే గ్రావెల్ రోడ్డు అధ్వానంగా తయారైంది.


వంగర: పెదరాజులగుమ్మడ ఆర్‌అండ్‌బీ రోడ్డులో గుంతల్లో నిలిచిన వర్షం నీరు


సంతకవిటి: చిత్తడిగా తయారైన శ్రీహరినాయుడుపేట- శంఖరపేట గ్రామాల మధ్యరోడ్డు

వర్షం కురిస్తే చాలు ఈరోడ్డు దమ్ముమడిలా మారిపోతుంది. ఈ మార్గంలో ప్రయాణించే వారు నరకయాతన పడుతున్నారు. బురద వల్ల ఎక్కడి వాహనాలు జారి పడతాయేమోనని ఈ మార్గంలో ప్రయాణమంటేనే వాహనచోదకులు భయపడిపోతున్నారు. పక్క జిల్లా పార్వతీపురం మన్యంకు అవసరాల నిమిత్తం వెళ్లే ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది. అలాగే కొప్పర, కె.కొత్తవలస, రుషింగి, మద్దివలస తదితర గ్రామాల్లో సీసీరోడ్లు శిథిలం కావడం, కొన్ని చోట్ల లేకపోవడం, సరైన డ్రైనేజీ వ్యవస్థలేకపోవడంతో వర్షంనీరు వీధి రోడ్లపై నిలిచిపోయి బురదమయంగా మారుతున్నాయి.పెదరాజులగుమ్మడ నుంచి వి.వి.ఆర్‌పేట వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో అడుగుకో గొయ్యి దర్శనమిస్తోంది. అధికారులు స్పందించి గ్రావెల్ రోడ్లను తారురోడ్లుగా అభివృద్ధి చేయాలని, శిథిలమైన సిమెంట్ రోడ్ల స్థానంలో మళ్లీ రోడ్లు వేయాలని, అధ్వానంగా ఉన్న బీటీ రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రజాసమస్యలపై పోరాడండి


వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్


జగన్‌మోహన్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న తలే రాజేష్

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్య నాయకులతో పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలపై చేయాల్సిన పోరాటాలపై మాజీ ముఖ్యమంత్రి నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశం అనంతరం జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ప్రత్యేకంగా కలిసి పాలకొండ, రాజాం నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితులపై చర్చించారు.
– రేగిడి/రాజాం

## కోళ్లఫారం తొలగించాలని నిరసన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గిరిజనులు, నాయకులు

మెంటాడ: మండలంలోని జయతి పంచాయతీలో బిరసాడవలస గిరిజన గ్రామాన్ని ఆనుకుని ఉన్న కోళ్లఫారాన్ని అక్కడి నుంచి తొలగిం చాలని గిరిజన నేత ఈదుబిల్లి బోడయ్య డిమాండ్ చేశారు.కోళ్లఫారం తొలగించాలన్న డిమాండ్‌తో బిరసాడవలస గ్రామస్తులు మూడో రోజు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనలు కొన సాగించారు. ఈసందర్భంగా బోడయ్యమాట్లాడుతూ కోళ్లఫారం వచ్చే దుర్గం ధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈగలు వృద్ధి చెందడం వల్ల వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. సమస్యపై కోళ్ల ఫారం యాజ మాన్యంతో ఎన్నిసార్లు మాట్లాడినా ఫలితం ఉండడం లేదన్నారు. బిరసాడవలస గ్రామానికి ఆనుకుని ఏడేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ కోళ్ల ఫారం ఏర్పాటు చేశారన్నారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సబ్బవరపు రాజశేఖర్ మాట్లాడుతూ కోళ్లఫారం చుట్టూ ఉన్న 5 పంచాయతీలపై దీని ప్రభావం పడుతోందన్నారు. ముఖ్యంగా బిరసాడవలస గ్రామంలో ప్రజలు వ్యాధులకు గురవతున్నారని, అన్ని పార్టీలు సహకారంతో ఈ దీక్షలు చేస్తున్నామని చెప్పా రు. గత 20 రోజులుగా కోళ్లఫారం వద్ద తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్షలు చేస్తున్నా ఎటువంటి స్పందన లేకపోగా, కోళ్ల ఫారం యాజమాన్యం నుంచి నాయకులు డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపిస్తూ కొందరు బురదజల్లే వీడియోలను సృష్టించి సమస్యను పక్క తోవ పట్టిస్తున్నారన్నారు. ఈ ఆరోపణల వెనుక ఒక పత్రిక విలేకరి(సాక్షి కాదు) హస్తం ఉన్నట్టు ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు రెడ్డి రాజప్పలనాయుడు, సీపీఎం నాయకుడు రాకోటి రాములు, తదితరులు పాల్గొన్నారు.

## ఐకమత్యంతో మెలగాలి


గెడ్డవలస గ్రామస్తులతో సమావేశమైన సీఐ అశోక్‌కుమార్

రాజాం సిటీ: గ్రామాల్లో ప్రజలంతా ఐకమత్యంతో మెలగాలని, అనవసర గొడవలకు దిగి కేసుల్లో ఇరుక్కో వద్దని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని గెడ్డవలస గ్రామంలో బుధవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. యువత, విద్యార్థులు మత్తుపదార్థాలు, బెట్టింగ్‌లు జోలికి పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పా రు.రోజు రోజుకూ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలిరూరల్: మండలంలోని పెంట,జగన్నాథపురం,పిరిడి,కలవరాయి, వంతరాం, పినిపెంకి గ్రామాలకు గురువారం విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ అనంతరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలవరాయి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద, బల్జిపేట ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లను ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టను న్న నేపథ్యంలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలన

రేగిడి: సంకిలి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ఎంఈఓ ఎం.వి. ప్రసాదరావు బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న వంటకాలను రుచిచూశారు. ఈసందర్భంగా వంట నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మెనూ పక్కాగా పాటించాలని, నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు. ఆయన వెంట హెచ్ఎం ఎం.రామునాయుడు ఉన్నారు.

## నిమ్మలపాడులో వైద్యశిబిరం


శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ రఘువంశీ, వైద్యసిబ్బంది

బొబ్బిలిరూరల్: మండలంలోని నిమ్మలపాడు గిరిజన గ్రామంలో పిరిడి పీహెచ్‌సీ వైద్యాధికారి రఘువంశీ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వ హించారు. ప్రజలకు వివిధ వైద్య పరీక్షలు చేసి, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. వర్షాలు కురుస్తున్నందు వల్ల గిరిజన ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని గ్రామస్తులకు సూచించారు.అలాగే బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.ఆశ వర్కర్లు, పీహెచ్‌సీ వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## జూలై 9న ఆటో వర్కర్ల దేశవ్యాప్త సమ్మె


మాట్లాడుతున్న శంకరరావు, ఆటో కార్మికులు

బొబ్బిలి: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మోటారు వాహనాల నూతన చట్టాల వల్ల రవాణా రంగం తీవ్రంగా నష్టపోతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకర రావు అన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ చట్టాల వల్ల భారీ జరిమానాలు, శిక్షలు పడతాయన్నారు. రవాణా రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే కుట్రలో భాగంగానే కేంద్రం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వం ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. బీమా ప్రీమియంలు తగ్గించి, గత ప్రభుత్వం అమలు చేసిన వాహన మిత్ర పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జూలై 9న దేశవ్యాప్త సమ్మెలో ఆటోకార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆటో యూనియన్ నాయకులు ఎం.శంకరరావు, సీహెచ్.గోపి, ఆర్ రమణ, వై.రామకృష్ణ పాల్గొన్నారు.

## అవకతవకలకు పాల్పడితే చర్యలు


మాట్లాడుతున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్

తెర్లాం: రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా నిర్వహించాలని, అవకతవకలకు పాల్పడుతున్నట్టు ఫిర్యాదులు వస్తే సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీఎస్‌డీటీ స్వర్ణలత అధ్యక్షతన మండలంలోని రేషన్ డీలర్లతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లంతా ప్రతీనెలా రేషన్ సరుకుల కోసం సకాలంలో డీడీలు తీయాలని, ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి డిపోలకు బియ్యాన్ని తూనిక వేసి తీసుకువెళ్లాలని సూచించారు. లబ్ధిదారులకు పంపిణీ చేసేటప్పుడు తూనికలో తేడాలు లేకుండా చూడాలన్నారు. సీఎస్‌డీటీ స్వర్ణలత మాట్లాడుతూ ప్రతీనెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ లోగా సరుకుల పంపిణీ పూర్తి చేయాలని సూచించారు.

## రక్తదానం సామాజిక బాధ్యత


రక్తదానం చేస్తున్న వైభవ్ జ్యూయలర్స్ సంస్థ ఉద్యోగులు

రాజాం సిటీ: రక్తదానం సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని రాజాం రెడ్ క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. స్థానిక వైభవ్ జ్యూయలర్స్‌లో ఆ సంస్థ వ్యవస్థాపకుడు జి.మనోజ్‌కుమార్ జయంతిని పురస్కరించుకుని బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆ సంస్థ ఉద్యోగులు 25 మంది రక్తదానం చేశారు. రక్తదాతలను రెడ్ క్రాస్ అధ్యక్షుడు సాయిప్రశాంత్ కుమార్‌తో పాటు వైభవ్ జ్యూయలర్స్ మేనేజర్ రంజిత్‌కుమార్, ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీం, ఎస్‌బీఐ రాజాం మేనేజర్ కె.శ్రీనివాస్, రెడ్‌క్రాస్ సభ్యుడు పెంకి చైతన్యకుమార్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, అపోహలు వీడి ఆరోగ్యంగా ఉన్న యువకులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

## సంక్షిప్తంగా...

**10 మద్యం బాటిల్స్ స్వాధీనం**

బొబ్బిలిరూరల్: మండలంలోని పక్కి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా మద్యం బాటిల్స్ తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ పి.చిన్నం నాయుడు తెలిపారు. బుధవారం మద్యం బెల్ట్ దుకాణాల తనిఖీకి వెళ్తుండగా 10 మద్యం బాటిల్స్‌తో పట్టుబడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేసి మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

**చెత్త సేకరణ పరిశీలన**

రాజాం: మండలంలోని బొద్దాం, పెనుబాక గ్రామాల్లో ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు బుధవారం ఉదయం పర్యటించారు. ఆయా గ్రామాల్లో క్లాప్ మిత్రలు ఇంటిం టి నుంచి చెత్త సేకరణ చేస్తు న్నదీ లేనిది పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన క్లాప్ మిత్రలకు పలు సూచనలు చేశారు. రోజూ ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేక రించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని చెప్పారు. ఆయా గ్రామాల్లో మహిళలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ వెంట ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఉన్నారు.

**శిక్షణను సద్వినియోగించుకోవాలి**

వంగర: మహిళలు కుట్టు శిక్షణను సద్వినియోగించుకుని స్వయం ఉపాధి పొందాలని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి సూచించారు. ఎం.సీతారాంపురంలో నిర్వహిస్తున్న కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు.ఆయన వెంట సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

**104 వైద్య శిబిరం**

బాడంగి: మండలంలోని పింద్రంగివలసలో బుధవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ షేక్‌ఇమ్రాన్ శిబిరంలో 70 మందికి వివిధ వైద్యపరీక్షలు చేశారు.అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసి, ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. గ్రామంలో తాగునీటికి క్లోరినేషన్ పరీక్ష చేశారు. వైద్యసిబ్బంది పి. తిరుపతినాయుడు, స్వప్న,మురళి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**సచివాలయంలో తనిఖీలు**

వంగర: స్థానిక గ్రామ సచివాలయంలో తహసీల్దార్ హరి రమణారావు బుధవారం తనిఖీలు చేశారు. సిబ్బంది హాజరుతో పాటు ఇతర రికార్డులను, సచివాలయంలో అందిస్తున్న ఆధార్‌సేవలను పరిశీలించారు. సమయపాలన పాటిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమస్యలపై ప్రజలు అందించే అర్జీలకు తక్షణం పరిష్కారం చూపాలని సిబ్బందికి సూచించారు.

**ఇంటి పన్ను నోటీసులు**

బొబ్బిలి: పట్టణంలో ఇంత వరకూ ఇంటి పన్ను లెక్కించని, పన్ను పరిధిలో లేనివారిని గుర్తించిన మున్సిపల్ అధికారులు బుధవారం వారికి నోటీసులు ఇచ్చారు. ఆర్ఓ నాగరాజు, ఆర్ఐ పి.సురేష్‌బాబు తమ సిబ్బందితో ఆయా ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చారు. సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

**ట్రాక్టర్లను దమ్ముచక్రాలతో రోడ్లపై నడపొద్దు**

వంగర: ట్రాక్టర్లను దమ్ము చక్రాలతో తారురోడ్లపై నడపవద్దని ఎస్ఐ షేక్‌శంకర్ ట్రాక్టర్ డ్రైవర్లకు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పలువురు ట్రాక్టర్ డ్రైవర్ల తో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూదమ్ముచేసిన అనంతరం ఐరన్ చక్రాలతో ట్రాక్టర్లను రోడ్లపై నడపడం వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయని అన్నారు. దమ్ముపట్టే సమయాల్లో ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని, అలాగే అధిక లోడ్‌తో వాహనాలు నడపవద్దని చెప్పారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**నేటి నుంచి నట్టల నివారణ మందు పంపిణీ**


వెటర్నరీ అసిస్టెంట్లతో సమావేశమైన పశువైద్యాధికారి అప్పలనాయుడు

రామభద్రపురం: మండలంలో గొర్రెలు,మేకలకు ఈ నెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేయనున్నామని పశువైద్యాధికారి ఏ.అప్పలనాయుడు తెలిపారు. జామి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు.అనంతరం సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు.నట్టల నివారణ మందుల వినియోగంపై గొర్రెలు, మేకల యజమానులు,కాపరులకు అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలో 17,090 గొర్రెలు,మేకలు ఉన్నాయని, ఈ ఏడాదిలో వీటన్నిటికీ నాలుగు విడతల్లో నట్టల నివారణ మందులు వేయనున్నట్టు చెప్పారు. ప్రస్తుతం మొదటి విడత ప్రారంభిస్తున్నామని తెలిపారు.

## సచివాలయ సిబ్బంది నిరసన


రాజాంలో చేపట్టిన నిరసన ర్యాలీలో సచివాలయ ఉద్యోగులు


రామభద్రపురం: ఎంపీడీఓ రత్నంకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు


తెర్లాం: ఎంపీడీఓ రాంబాబుకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెర్లాం, రాజాం, రామభద్రపురం మండలాల్లో పని చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది బుధవారం నిరసన తెలిపారు. రాజాం మున్సిపాలిటీలో, మండలంలోని గ్రామాల్లో పనిచేస్తున్న సచివాలయ సిబ్బంది రాజాం పట్టణ ప్రధాన రహదారిలో నిరసన ర్యాలీ చేయగా... తెర్లాం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆ మండల సచివాలయ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీల్లో భాగంగా తమకు సొంత మండలాల్లోనే పనిచేసేలా అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామ,వార్డు సచివా లయ ఉద్యోగులకు ప్రమోషన్ కల్పించడంతో పాటు స్పష్టమైన చార్ట్‌తో సర్వీసు రూల్స్ అమలు చేసిన తర్వాతే బదిలీలు జరపాలన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్, పెండింగ్ అరియర్‌ను విడుదల చేయాలని కోరారు. రేషనలైజేషన్ ప్రక్రియ ద్వారా ఏర్పడిన మిగులు సిబ్బందిని ప్రభుత్వం ఏ విధంగా వినియోగించుకుంటుందో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓలకు వినతిపత్రాలు అందజేశారు.
– తెర్లాం/రాజాం/రామభద్రపురం